

దామరగిద్దలో..


ధన్వాడలో..


పెద్దచింతకుంటలో..


కోస్గిలో అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


అశోక్‌నగర్ మాలలాంభిక ఆలయంలో


మక్తల్ విద్యుత్ కాంతులతో కన్యకాపరమేశ్వరి ఆలయం

సరస్వతి నమస్తుభ్యం

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

■ నారాయణపేట పట్టణంలోని దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శక్తిస్వరూపిణి దుర్గమ్మ బుధవారం చదువులతల్లి సరస్వతి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కోటకొండలో మూలా నక్షత్రం రావడంతో 10కేజీల పసుపుకొమ్ములతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు.

■ మక్తల్ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు అమ్మవారిని వాసవిమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మాద్వార్‌లో బ్రహ్మంగారి ఆలయం వద్ద దుర్గామాతకు ప్రత్యేక పూజలుచేశారు.

■ మరికల్‌లో బుధవారం స్థానిక కాళికాదేవి ఆలయంలో సరస్వతిదేవి అవతరంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో హరిష్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్, శ్రీను, కృష్ణచారి, రాజు, వీరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

■ దామరగిద్దలో వాసవి కన్యాక పరమేశ్వరి ఆలయంలో సరస్వతీ మాత అలంకరణలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండయ్య, శేఖరయ్య, వెంకట్రామణ, శ్రీనివాస్‌శెట్టి, బాలకృష్ణ, మధు, వెంకటమ్మ, సువర్ణమ్మ, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

■ ఊట్కూరు మండలం బిజ్వార్‌లోని అంభత్రయక్షేత్రంలో ఆదిత్యపరాశ్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ మేరకు.. మహిళలు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

■ కోస్గి పట్టణంలోని వాడవాడల్లో ఆయా కాలనీ వాసుల ఆధ్వర్యంలో అమ్మవారిని రోజుకో రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఏడోరోజు అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు విద్యాభ్యాసం నిర్వహించారు.


దామరగిద్దలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు


బిజ్వార్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళ భక్తులు


కోటకొండలో నగరేశ్వర ఆలయంలో..

మహిళలకు అండగా షీటీం

నారాయణపేట: జిల్లాలో మహిళలకు అండగా షీటీం పోలీసులు పనిచేస్తున్నారని షీటీం పోలీసులు బాలరాజు, చెన్నయ తెలిపారు. బుధవారం స్థానిక సత్యసాయి కాలనీలో మహిళా చట్టాలు, సీసీ కెమెరాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. మహిళలను ఎవరైనా లైంగికంగా వేధించిన, స్కూల్‌కి వెళ్లి వచ్చే సమయంలో వేధించిన షీటీం నంబర్ 8712670398కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అట్టి వారిపై చట్టప్రకారం చర్యలుంటాయని తెలిపారు. కాలనీలో దొంగతనాలు జరగకుండా భద్రతకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న షీటీం సిబ్బంది

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

ఊట్కూరు: మండల శివారులో నారాయణపేట, మక్తల్ ప్రధానరోడ్డు మరమ్మతు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు.. మండల అధ్యక్షుడు విఙ్ఞేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తిప్పరాస్‌పల్లి నుంచి మల్లెపల్లి స్టేజీ వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. రోడ్డు మరమ్మతు చేసేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రూ. 30లక్షల నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోని బీటీరోడ్డుకు మరమ్మతు చేపట్టడంతో ఆయన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ధనుంజయ్యగౌడ్, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లింగం, ఎల్కోటి జనార్ధన్‌రెడ్డి, అశోక్, శంకర్, జలాల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారం

మక్తల్: మండలంలోని సంగంబండ బుడగజంగాల కాలనీలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నాయకులు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు బాలకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించి తన సొంత ఖర్చులతో సింగిల్ ఫేజ్ మోటార్లను మంజూరు చేయించారు. బుధవారం కాలనీవాసుల సహకారంతో బోర్లకు మోటార్లను బిగించారు. దీంతో తాగు నీటి సమస్య పరిష్కరించిన ఆయనను కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు. ఆయనతో పాటు మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, బాల్‌రెడ్డి, గవినోళ్ల గోపాల్‌రెడ్డి, ఎం.బాల్‌రాంరెడ్డి, చెన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న బాలకృష్ణారెడ్డి

ప్రతి ఒక్కరికీ దేశంపై భక్తి ఉండాలి

మక్తల్: ప్రతిఒక్కరికీ దేశం పట్ల ప్రవర్తనా క్రమశిక్షణ, భక్తి అవసరమని పాలమూరు ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్, న్యాయవాది యేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తయిన తరుణంలో శతజయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని రెడియంట్ పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాల మైదానం వరకు భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. గ్రామాల్లో అంటరానితనం ఉండొద్దని, అందరూ సమానంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో వక్తలు వసంతం వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిల్ రెడ్డి, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

క్లుప్తంగా

కాన్షీరాం ఆశయాలను కొనసాగిద్దాం



మక్తల్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం ఆశయాలను కొనసాగిద్దామని నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో కాన్షీరా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది దరశరత్, డెవిడ్ మహరాజ్, ఈశ్వర్, కర్ని బాల్‌రాజ్, రామకృష్ణ, గెవ్వల బాల్‌రాజ్, అరుణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాలీబాల్ టోర్నీ ప్రారంభం

మక్తల్: మండలంలోని పారేవులలో యూత్ ఆధ్వర్యంలో ఈ నెల11న వాలీబాల్ టోర్నీ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు పరుశరాం అభి, శివ, దశరథ్ బుధవారం తెలిపారు. ఈ మేరకు.. క్రీడల్లో పాల్గొనే వారు 10న తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. దాతలు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశిరెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల్లో నైపుణ్యతను చాటాలని, స్నేహపూర్వకంగా క్రీడల్లో పాల్గొనాలని కోరారు.

జోగుళాంబకు తరలిన భక్తులు

ధన్వాడ: మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయ భక్తులు నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి మాలధరించారు. ఈ మేరకు.. బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం పాదయాత్రగా జోగులాంబ అమ్మవారి దర్శనంకోసం తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో నారాయణ, నర్సింహులునాయుడు, ఆనంద్, వెంకటయ్య, భాస్కర్, వెంకటేష్, రాములు, గోవర్ధన్‌గౌడ్, రాములు, చక్రి, అజయ్, హరీష్‌కుమార్ ఉన్నారు.



ఉపాధి పనుల్లో అధికారుల అలసత్వం


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మొగులప్ప

- సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్‌డీఓ మొగులప్ప

మాగనూర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ.1.41కోట్లతో గ్రామాల్లో పనులు చేశారని తెలిపారు. డీఆర్‌డీఓ మాట్లాడుతూ.. పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధిస్తామన్నారు. పనులకు సంబంధించి మొత్తం రూ.7లక్షలు రికవరీ చేయడం జరుగుతుందని, కొన్ని గ్రామాల్లో వలస కూలీలు పనులు చేసినట్లు వారి అకౌంట్‌లో డబ్బులు వేయించి, ఎఫ్‌ఏలు, కూలీలు సరి సగం పంచుకున్నట్లు తెలిసిందన్నారు. అంగన్‌వాడీ ఆయాలకు, గ్రామపంచాయతీ సిబ్బందికి ఒకేసారి రెండు పేమెంట్లు పడ్డాయని తనిఖీ బృందం అధికారులకు తెలిపారు. అమ్మపల్లి గ్రామంలో చనిపోయిన వ్యక్తురాలిపై ఉపాధహామీ పనుల బిల్లులు తీసుకున్నట్లు తెలిసింది. వీటన్నింటిపై అధికారులు విచారించాలని డీఆర్‌డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో సోషల్ అడిట్ అధికారి చంద్రశేఖర్, నాగిరెడ్డి, మహేష్, ఎంపీఓ విజయలక్ష్మి ఏపీఓ సత్యప్రకాష్, ఇన్‌చార్జ్ ఏపీవో హర్షవర్ధన్, ఈసీ ఉషన్న పాల్గొన్నారు.

14న కోటకొండలో దర్గా ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండలో ఈ నెల 14నుంచి రెండు రోజులపాటు హజ్రత్ గౌసే ఆజం దస్తగీర్ రహమతుల్లా అలై నిర్వహించనున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే పండగ కార్యక్రమాల్లో భాగంగా గ్రామస్తులు సుఖసంతోషాలతో పండగ నిర్వహించుకోవాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట రూరల్: నవరాత్రిని పురస్కరించుకొని జిల్లా సమీపంలోని బనదేశ్వర స్వామి నాలయంలో ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారికి అభిషేకం, బిల్వర్చన, మహా మంగళ హారతి తదితర ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. వీరశైవ, మహిళలు స్వామివారిని దర్శించుకున్నారు.



ఆకర్షించిన డబుల్ రెయిన్ బో


నారాయణపేట శివారులో ఆకాశంలో హరివిల్లు డబుల్

నారాయణపేట: సూర్యస్తమయ సమయంలో ఇంద్ర ధనస్సు ఏర్పడింది. జిల్లా అంతటా ఒక్క సారిగా బుధవారం సాయంత్రం వాతవరణం చల్లబడింది.. ఆకాశంలో రంగుల హరివిల్లు డబుల్ కనిపించడంతో చూపరులను ఆకర్షించింది. జిల్లాలోని ఊట్కూర్, నారాయణపేట శివారులో పర్పుల్, నీలం, బ్లూ, ఆకుపచ్చ, పసుపు, నారింజ, ఎరుపు రంగులతో.. మబ్బులు కమ్మిన ఆకాశంలో ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. దీంతో చాలామంది జనాలు ఈ అద్భుత దృశ్యాన్ని తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో


కోస్గిలో బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడుతున్న మహిళలు

కోస్గి/ధన్వాడ/మరికల్: 'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో' అంటూ బుధవారం పట్టణంలో బతుకమ్మ వేడుకల్లో పలు కాలనీలకు చెందిన మహిళలు బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. తీరొక్క పూలతో అందంగా అలంకరించి కోలాటాలు, బతుకమ్మ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో బతుకమ్మలను ఊరేగించారు. అనంతరం తోగపూర్ గ్రామ పరిధిలోని దండం చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే ధన్వాడలోని గాంధీనగర్ కాలనీ మహిళలు వివిధరకాల పూలను తీసుకొచ్చి బతుకమ్మను తయారుచేసి చుట్టూ మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆటలు ఆడి అలరించారు. అలాగే మరికల్‌లో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ మేరకు.. బతుకమ్మను తయారుచేసి చుట్టూ మహిళలు ఆటలు ఆడారు.

మక్తల్: మున్సిపాల్ పరిధిలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత మహిళలతో కలిసి బతుకమ్మలకు పూజచేసి సంబరాలు చేశారు. అనంతరం ఊరేగింపులో వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.


మరికల్‌లో బతుకమ్మలతో మహిళలు


ధన్వాడలో..


మక్తల్‌లో..

కళలు సంస్కృతికి పట్టుగొమ్మలు

నారాయణపేట రూరల్: దాండియా, కోలాటం ఆటలు భారతీయ సంస్కృతి సాంప్రదాయనికి పట్టుగొమ్మల కళలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా బన్సీలాల్ పెట్రోల్ బంక్ సమీపంలో నిర్వహించిన దాండియా ఆటల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.. తెలంగాణ కళా నైపుణ్యాలను నలుదిశల చాటాలన్నారు. అనంతరం చక్కని దాండియా ప్రదర్శన చేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివ రెడ్డి, బన్సిలాల్ లాహోటి, శ్రీనివాస్, శ్యాం లాహోటి, ఆనంద్, కైలాస్ లాహోటి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని నిరసన

నారాయణపేట: తెలంగాణలో జరుగుతున్న ఉద్యోగ నియమకాలను తక్షణమే నిలిపివేసి ఎస్సీ వర్గీకరణ అమలు చేసేంత వరకు నియమకాలు ఆపాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ మేరకు.. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య మాట్లాడారు.. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంతో 3 దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేస్తున్నామని ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ధర్మశాసనం చారిత్రాత్మక తీర్పును ఇచ్చిందని గుర్తుచేశారు. కోర్టు తీర్పు ప్రకారం సీఎం ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకొచ్చేవరకు నియమకాలను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, జిల్లా అధ్యక్షులు చల్లా వెంకటేష్, నాయకులు హన్మంతు, నాగేష్, బుడగజంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్యాణం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శిరిగిరీ శ్యాం గోపాల్ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తంచేస్తున్న దళిత సంఘాల నాయకులు